ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

గోపాలపట్నం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్‌కు ఒక రోజు మాత్రమే గడువు ఉండడంతో పోలింగ్ బూత్‌లలో అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో 9 పోలింగ్ బూత్‌లు ఉన్నాయి. 270, 271, 272,273,274,275, 276, 277, 278 నంబర్లు గల పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు.

- 270 పోలింగ్ బూత్ మర్రిపాలెం జ్యోతినగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో రూమ్ నంబర్-3లో ఏర్పాటు చేశారు. ఈ బూత్‌లో 1118 మంది ఓటర్లు ఉన్నారు.
- 271 పోలింగ్ బూత్ మర్రిపాలెం జ్యోతినగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో రూమ్ నంబర్ 4లో ఏర్పాటు చేశారు. ఇందులో 959మంది ఓటర్లు ఉన్నారు.
- 272 పోలింగ్ బూత్ మర్రిపాలెం జ్యోతినగర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో రూమ్ నంబర్ 5లో ఏర్పాటు చేశారు. ఈ బూత్‌లో 681 మంది ఓటర్లు ఉన్నారు.
- 273 పోలింగ్ బూత్ శ్రీహరి పురం పిలకవాని పాలెం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో గ్రౌండ్ ఫ్లోర్ రూమ్-1లో ఏర్పాటు చేశారు. ఇందులో 747 మంది ఓటర్లు ఉన్నారు.
- 274 పోలింగ్ బూత్ శ్రీహరి పురం గాంధీగ్రామ్ సింధియా న్యూ కాలనీలో జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో గ్రౌండ్ ఫ్లోర్ రూమ్ నంబర్-9లో ఏర్పాటు చేశారు. ఈ బూత్‌లో 892మంది ఓటర్లు ఉన్నారు.
- 275 పోలింగ్ బూత్ శ్రీహరి పురం (మల్కాపురం) జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల గ్రౌండ్ ఫ్లోర్ 5వ తరగతి గదిని ఏర్పాటు చేశారు. దీని పరిధిలో 1030 ఓట్లు ఉన్నాయి.
- 276-పోలింగ్ బూత్ బుచ్చిరాజుపాలెం 80అడుగుల రహదారిలో సెయింట్ ఆన్స్ పాఠశాలలో ఎల్‌కేజీ గది రూమ్ నంబర్-1లో ఏర్పాటు చేశారు. దీని పరిధిలో 1293 ఓట్లు ఉన్నాయి.
- 277 పోలింగ్ బూత్ గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో రూమ్ నంబర్-2లో ఏర్పాటు చేశారు. ఈ బూత్ పరిధిలో 1365 మంది ఓటర్లు ఉన్నారు.
- 278 పోలింగ్ బూత్ గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర ఉన్నతపాఠశాలలో రూమ్ నంబర్-3లో ఏర్పాటు చేశారు. ఈ బూత్ పరిధిలో 1008 మంది ఓటర్లు ఉన్నారు.


శ్రీహరిపురం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న సీఐ లూథర్‌బాబు


గోపాలపట్నం హైస్కూల్ వద్ద శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

మల్కాపురం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నిక సోమవారం జరగనున్న నేపథ్యంలో పారిశ్రామిక ప్రాంతంలోని పోలింగ్ కేంద్రాల వద్ద అధికారులు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తున్నారు. గాంధీ గ్రామ్ జీవీఎంసీ పాఠశాల,మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.అలాగే గాజువాక పోలీస్‌స్టేషన్ పరిధిలో వచ్చే 58వ వార్డు పిలకవానిపాలెంలోని జీవీఎంసీ పాఠశాలలో మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లను శనివారం ములగాడ మండల రెవెన్యూ అధికారులు, భద్రత పరిమైన అంశాలపై సీఐ లూథర్‌బాబు పరిశీలించారు. మూడు కేంద్రాల్లో సుమారు 4200 మంది ఓటు హక్కును వినియోగించుకోనున్నారు ఓటరు తనతో పాటు ఏదైనా గుర్తింపు కార్డు అధికారులకు చూపించాల్సి ఉంటుంది.

వాహనాల తనిఖీలు

ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. శ్రీహరిపురంతో పాటు ప్రధాన కూడళ్లలో సీఐ లూథర్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది వాహనాలను తనిఖీ చేశారు. అనుమానితులను విచారించారు. ఓటర్లను ప్రభావితం చేసే విధంగా కార్యక్రమాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు.

హెచ్ 3 ఎన్2 ఇన్ ఫ్లూయెంజాపై అవగాహన

మల్కాపురం: మల్కాపురం పల్లివీధి, గొల్లవీధి ప్రాంతాల్లో శనివారం హెచ్ 3 ఎన్2 ఇన్ ఫ్లూయెంజా లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు వలంటీర్లు అవగాహన కల్పించారు. గొంతునొప్పి, 3 లేక 5 రోజుల జ్వరం, 3 వారాల పాటు దగ్గు, ఆయాసం(కొద్ది మందిలో), చలి, వాంతులు, ముక్కు కారడం, తుమ్ములు దీని లక్షణాలు అని వివరించారు. నిత్యం చేతులను సబ్బుతో పరిశుభ్రం చేసుకోవడం, మాస్కులు ధరించడం, ఎవరైనా తుమ్మినా దగ్గినా వస్త్రం లేదా చేతులు అడ్డుపెట్టుకోవడం తదితర జాగ్రత్తలు చేపట్టాలన్నారు. ఎక్కువగా నీరు తాగాలని సూచించారు. డాక్టర్‌ను సంప్రదించకుండా మందులు వాడొద్దన్నారు.

మహనీయురాలు సావిత్రిబాయి పూలే


సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దళిత సేన నాయకులు

కంచరపాలెం: మహిళా సాధికారతకు నిలువెత్తు రూపం సావిత్రిబాయి పూలే అని దళిత సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొల్లమాల అప్పారావు కొనియాడారు. దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాల్తేటి పెంటారావు పిలుపు మేరకు శనివారం ఊర్వశి జంక్షన్‌లోని కార్యాలయంలో సావిత్రిబాయి వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గొల్లమాల అప్పారావు మాట్లాడుతూ కుల వివక్షను రూపుమాపడంలో మహనీయురాలు సావిత్రిబాయి పూలే దంపతులు చేసిన పోరాటం గొప్పదన్నారు. సామాజిక సంస్కరణ ఉద్యమ కార్యకర్తగా, దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా ఆమె సేవలు అజరామరమని కీర్తించారు. కార్యక్రమంలో దళిత సేన నగర మహిళా కన్వీనర్ గొల్లమాల మీనా, పుచ్చ కామేశ్వరరావు, పట్నాల ఝాన్సీరాణి, తాటిపూడి సీతారామ్, రాణి, మల్లికార్జున్, రాంజీ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

కల్యాణం.. కమనీయం


కల్యాణ ఉత్సవ మూర్తులు


కల్యాణ వేడుకకు హాజరైన భక్తులు

కంచరపాలెం: గొల్ల కంచరపాలెంలో కోదండ సీతారామ సంపత్ వేంకటేశ్వర స్వామి, ధనలక్ష్మి దేవి విగ్రహాల ప్రతిష్టాపన ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా శనివారం సీతారాముల, సంపత్ వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని శ్రీమాన్ రేజేటి శ్రీరామాచార్యులు నేతృత్వంలో అట్టహాసంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి కల్యాణాన్ని కనులారా వీక్షించారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ స్వాములను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ అన్నసమారాధనను ప్రారంభించారు. గ్రామ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


పూజలు చేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్

ఎమ్మెల్సీ అభ్యర్థుల ముఖాముఖి నేడు

సీతంపేట: ఈ నెల 13న జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఆదివారం ఉదయం 9.30 గంటలకు ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఎమ్మెల్సీ అభ్యర్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఉత్తరాంధ్ర విద్యావంతుల వేదిక కన్వీనర్ ఆడారి కిషోర్‌కుమార్ తెలిపారు. పబ్లిక్ లైబ్రరీలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సహాయత వెల్ఫేర్ సొసైటీతో కలిసి మొదటి సారిగా ఎన్నికల బరిలో పోటీపడుతున్న అభ్యర్థులతో ఓపెన్ డిబేట్ ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధాన రాజకీయ పార్టీలు మద్దతు ఇస్తున్న అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్న సుమారు 38 మంది పాల్గొంటారని వెల్లడించారు. వారంతా తమ మ్యానిఫెస్టోను వివరిస్తూ ఈ చర్చా వేదికపై నుంచి కార్యాచరణ వివరిస్తారన్నారు. ముందుగా కార్యక్రమ కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో జ్ఞానానంద, వెంకటేష్, శ్రీధర్, వంశీ, అసిత పాల్గొన్నారు.


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆడారి కిషోర్‌కుమార్

ఉక్కు ప్రైవేటీకరణను నిలిపివేయాలి


758వ రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న కాంట్రాక్ట్ కార్మికులు

కూర్మన్నపాలెం : ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం నిరంతరం కార్మికులు చేస్తున్న పోరాటానికి కేంద్ర ప్రభుత్వం సమాధానమివ్వాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 758వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో సంస్థకు చెందిన ఎం.ఎస్.ఎస్-2 విభాగానికి చెందిన కార్మికులు పాల్గొన్నారు. కార్మికులు చేస్తున్న పోరాటానికి విలువనిచ్చి కేంద్ర ప్రభుత్వం ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు.

ఏప్రిల్ 9న హెచ్‌ఆర్‌సీ సర్వసభ్య సమావేశం

దాబాగార్డెన్స్: ఏప్రిల్ 9న దాబాగార్డెన్స్‌లోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మానవ హక్కుల కౌన్సిల్(హెచ్‌ఆర్‌సీ) సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని కౌన్సిల్ కార్యదర్శి మంత్రి శ్యాంప్రసాద్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్లో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో భాగంగా మానవ హక్కుల పరిరక్షణలో పౌరుడి పాత్ర అనే అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్న వారిని ఆహ్వానించి వారి సూచనలు, సలహాలు స్వీకరిస్తామన్నారు. సర్వసభ్య సమావేశానికి హైకోర్టు న్యాయమూర్తులను ఆహ్వానిస్తున్నామని చెప్పారు. రాష్ట్ర స్థాయి కమిటీ ఏర్పాటుతోపాటు రాష్ట్ర గవర్నర్‌గా నియమితుడైన జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు మానవ హక్కుల పటిష్టతకు చేపట్టాల్సిన చర్యపై నివేదిక అందజేయనున్నట్టు పేర్కొన్నారు. జూలై నాటికి 25 వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా జాతీయ మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్‌పర్సన్‌లు, సభ్యులను ఆహ్వానించనున్నట్టు చెప్పారు. హక్కుల ఉల్లంఘనతో బాధితులైన వారి హక్కుల పరిరక్షణకు 25 ఏళ్లుగా కౌన్సిల్ పోరాడుతోందన్నారు. బాలలు, మహిళల హక్కులు, పర్యావరణ హక్కులపై అవగాహన కల్పించనున్నట్లు వివరించారు. రాజకీయాలకతీతంగా హక్కుల పరిరక్షణకు శ్రమిస్తున్న వారిని మాత్రమే తమ సంస్థ ప్రోత్సహిస్తుందన్నారు. సమావేశంలో వీఎస్ఎన్ మూర్తి, ఎస్‌వీ రమణ, అబ్దుల్ సత్తార్, రావాడ నాయుడు, మాధవి గణపతి, నక్కాన అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి శ్యాంప్రసాద్

నిరుద్యోగ యువతకు శిక్షణ

పెదగంట్యాడ: ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన (పీఎంకేవీవై) పథకంలో భాగంగా జిల్లాలోని 15 ఏళ్ల నుంచి 45 ఏళ్ల నిరుద్యోగ యువతకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని ప్రభుత్వ ఐటీఐ స్టీల్ సిటీ ప్రిన్సిపాల్ లండా సుధాకరరావు బుధవారం తెలిపారు. ఫిట్టర్, ఫ్యాబ్రికేషన్, టిగ్ వెల్డింగ్, అసిస్టెంట్ ఎలక్ట్రిషియన్, సీఎన్‌సీ టర్నింగ్, డేటా ఎంట్రీ ఆపరేటర్, ప్లంబర్ జనరల్ అండ్ లైట్ మోటర్ వెహికల్ డ్రైవింగ్ (ఎల్ఎంవీ) తదితర కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నామని వివరించారు. ఈ శిక్షణకు పదో తరగతి పాస్, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ పాస్, ఫెయిల్ అయిన వారు అర్హులన్నారు. డ్రైవింగ్ శిక్షణకు 18 ఏళ్లు నిండి ఉండాలని, ఐదో తరగతి నుంచి పదో తరగతి పాసైన, ఫెయిలైన వారు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం తమ కార్యాలయంలో ఉచితంగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్ జిరాక్స్, ఫోన్ నెంబర్, ఈ-మెయిల్ ఐడీతో తమ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ఆఖరి రోజు.. ప్రచార జోరు


మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో ప్రచారం చేస్తున్న జియ్యాని శ్రీధర్


సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతున్న ఆనంద్‌కుమార్


కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

మల్కాపురం: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార పర్వం ముగిసింది. ఆఖరి రోజు శనివారం బరిలో ఉన్న అభ్యర్థుల తరఫున మద్దతుదారులు పట్టభద్రులను కలిసి ప్రచారం చేశారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికల నేపథ్యంలో ఆయా పార్టీలు బలపరిచిన అభ్యర్థులకు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని శనివారం విస్తృతంగా ప్రచారం చేశారు. జీవీఎంసీ 61వ వార్డు పరిధి మల్కాపురం సెయింట్ మహిళా కళాశాలలో జరిగిన ప్రచారంలో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త, విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు. విద్యావంతుడైన సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉపాధ్యాయులను కోరారు. వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ, నాయకులు దాడి సత్యనారాయణ, 63వ వార్డు పార్టీ ఇన్‌చార్జి పిలక రామ్మోహన్‌రెడ్డి, బూస అప్పలరెడ్డి, సోనూ, చట్టి నూకరాజు యాదవ్, శంకరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే పీడీఎఫ్ అభ్యర్థి బలపరిచిన డాక్టర్ రమాప్రభకు తొలి ప్రాధాన్యత కల్పించాలని సీపీఎం నాయకులు, కార్యకర్తలు హెచ్‌పీసీఎల్ ఆఫీసర్స్ గేటు వద్ద ప్రచారం చేశారు. అభ్యర్థి డాక్టర్ రమాప్రభ పాల్గొని ఉద్యోగులను కలిశారు. పార్టీ నాయకులు ఎం.జగ్గునాయుడు, ఆర్.లక్ష్మణమూర్తి, ఉరుకూటి బాబూరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సుధాకర్‌దే విజయం

గోపాలపట్నం: ఉత్తరాంధ్ర పట్ట భద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌దే విజయమని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ అన్నారు. జీవీఎంసీ 52వ వార్డు మర్రిపాలెం వుడాలేఅవుట్‌లో శనివారం ఆయన పట్టభద్రుల ఇళ్లకు వెళ్లి ప్రచారం చేశారు. ఈనెల 13న జరిగే ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్‌కు తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్ కృష్ణ, సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యురాలు శ్రీదేవి వర్మ, పార్టీ నాయకులు వెదుళ్ల శ్రీనివాసరావు, జియ్యాని మారుతి పాల్గొన్నారు.


కార్మికులతో కలిసి ప్రచారంలో పాల్గొన్న పీడీఎఫ్ అభ్యర్థి రమాప్రభ

చెంతకే ఆధార్ సేవలు

- జోన్-5లో 10 కేంద్రాల ఏర్పాటు
- బయోమెట్రిక్, వ్యక్తిగత వివరాల అప్‌డేషన్‌కు అవకాశం


గణేష్‌నగర్-1లో ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రం


సంజీవయ్య కాలనీ సెంటర్‌లో ఆధార్ సేవలు పొందుతున్న ప్రజలు

కంచరపాలెం: ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు దాటిన ప్రజలు బయోమెట్రిక్, చిరునామా వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో ఆధార్ నమోదు కేంద్రాల సమాచారం తెలియక చాలా మంది ఇబ్బంది పడుతున్నారు. జీవీఎంసీ జోన్-5 పరిధిలోని 40 నుంచి 63 వరకు గల 24 వార్డుల్లోని సచివాలయాల్లో 10 ఆధార్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ తెలిపారు. ఎంపిక చేసిన సచివాలయాల్లో ఆధార్ అప్‌డేషన్ సేవలను పొందవచ్చు. ఆధార్ కేంద్రాలను జెడ్సీ కృష్ణ పర్యవేక్షిస్తున్నారు. ఆయా ఆధార్ కేంద్రాల్లో ఎప్పుడైనా బయోమెట్రిక్, వ్యక్తిగత, చిరునామ వివరాలను అప్‌డేట్ చేసుకోవచ్చని ఆయన చెప్పారు.

సద్వినియోగించుకోండి



జీవీఎంసీ జోన్-5కు సంబంధించి ఆధార్ అప్‌డేషన్ సేవలను ప్రజలు సద్వినియోగించుకోవాలి. చిరునామా, వ్యక్తిగత వివరాల్లో సవరణలకు అవకాశం కల్పించాం. సచివాలయాల్లో అందుబాటులోకి తీసుకొచ్చిన ఆధార్ కేంద్రాల్లో తప్పుఒప్పులను సవరించుకుని వివరాలను అప్‌డేట్ చేసుకోండి. ఆధార్ కేంద్రాల్లో ఎలాంటి సమస్యలున్నా జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేయండి.

– ఆర్.జి.వి.కృష్ణ, జోన్-5 కమిషనర్, జీవీఎంసీ

జీవీఎంసీ జోన్-5లో ఆధార్ కేంద్రాల వివరాలు

వార్డు నం.	సచివాలయం కోడ్	ఏరియా	సెక్రటరీ పేరు	ఫోన్ నంబర్
43.	21086246	వెంకటేశ్వర న్యూకాలనీ	కె.మోహన్‌రావు	94936 32327
45.	21086625	నరసింహనగర్-3	కె.తేజేశ్వరరావు	97033 30393
47.	21086260	సంజీవయ్య కాలనీ	ఎన్.శివరాము	96520 96465
51.	21086287	అంబేడ్కర్ కాలనీ	జి.ప్రభాకర్	94943 10435
51.	21086289	మాధవధార-2	జి.వెంకటేష్	99667 14743
51.	21086290	గాంధీనగర్-3	ఎన్.పల్లవి	78426 23525
50.	21086294	వుడా కాలనీ	ఎన్.నరేంద్ర	81251 17262
57.	21086302	భవానీ గార్డెన్స్	హెచ్.రాజేశ్వరి	96663 67380
57.	21086303	గణేష్‌నగర్-1	ఎం.కుమారి	87906 98924
61.	21086340	ఇండస్ట్రియల్ కాలనీ-1	యు.చౌదరి	90523 36526

పల్లకీలో జంట.. కనుల పంట



ఎంవీపీకాలనీ: ఓ నవ జంట శనివారం పల్లకీలో ఊరేగుతూ కనువిందు చేసింది. సాధారణంగా పల్లెటూరులో ఇటువంటి కమనీయ దృశ్యాలు కనిపిస్తాయి. నగరంలోని అప్పుఘర్‌లో బంధుమిత్రుల పరివారంతో పల్లకీలో ఊరేగుతున్న ఈ నవ జంటను చూసేందుకు వాహనచోదకులు, స్థానికులు ఉత్సాహం చూపించారు.

దివ్యాంగులకు ట్రై సైకిళ్ల అందజేత

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ సారథ్యంలో మూడు చక్రాల సైకిళ్లను అందించింది. విజయనగరానికి చెందిన రేవతి అనే దివ్యాంగురాలికి మూడు చక్రాల సైకిల్ కావాలని ఆమె బంధువులు ట్రస్ట్ ప్రతినిధులను సంప్రదించడంతో స్పందించిన ట్రస్ట్ రేవతితో పాటు మరో నలుగురికి మూడు చక్రాల సైకిళ్లను అందించింది.

క్లుప్తంగా

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

దాబాగార్డెన్స్: ఉగాది విశిష్ట ప్రతిభారత్న-2023 పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సర్వేజనా సుఖినో భవంతు సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాస్టారు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో పల్లెలు, పట్టణాల్లో ఉన్న కవులు, కళాకారులు, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారుల ప్రతిభను గుర్తించి ఉగాది విశిష్ట ప్రతిభా రత్న పురస్కారంతో ఈ నెల 26న హైదరాబాద్‌లో ఘనంగా సత్కరించనున్నట్టు పేర్కొన్నారు. ఆయా రంగాల్లో సేవలందిస్తున్న వారు తమ ప్రతిభను గురించి తెలియజేసే సర్టిఫికెట్లు, ఫొటోలు, పత్రికల క్లిప్పింగ్స్.. గతంలో పొందిన పురస్కారాల సర్టిఫికెట్లు, ఫొటోలు జిరాక్స్ కాపీలతో పాటు 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జతచేసి ఈ నెల 20వ తేదీలోగా సర్వేజనా సుఖినో భవంతు, 1-20-164, గోకుల్‌నగర్, వెంకటాపురం పోస్టు, తిరుమలగిరి, సికింద్రాబాద్-15 చిరునామాకు పంపాలని సూచించారు. మరిన్ని వివరాలకు 96523 47207 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

నల్లబ్యాడ్జీలతో విధులకు రెవెన్యూ ఉద్యోగులు

మహారాణిపేట: కలెక్టరేట్‌లో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న రెవెన్యూ సిబ్బంది నిరసనలో భాగంగా శనివారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీజేఏసీ అమరావతి జిల్లా చైర్మన్ సత్తి నాగేశ్వరరెడ్డి, ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్.వి.రమేష్, ఇతర నాయకులు రాజేంద్ర వర్మ, నాల్గో తరగతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నమ్మి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

సీఐఎస్ఎఫ్ జవానుకు కన్నీటి వీడ్కోలు


తండ్రికి కొరివి పెడుతున్న పెద్ద కుమార్తె శ్వేత

ఉయ్యూరు: సీఐఎస్ఎఫ్ జవానుకు కన్నీటి వీడ్కోలు పలికారు. ఉయ్యూరుకు చెందిన చింతా రమేష్‌బాబు (53) వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో సీఐఎస్ఎఫ్ జవానుగా పనిచేస్తున్నారు. గుండె పోటుతో గురువారం కన్నుమూశారు. భౌతిక కాయాన్ని శుక్రవారం రాత్రి స్వగ్రామమైన ఉయ్యూరుకు తరలించారు. శనివారం రమేష్‌బాబు భౌతికకాయానికి అధికార లాంఛనాలతో సీఐఎస్ఎఫ్ జవానులు అంత్యక్రియలు జరిపించారు. జవాను రమేష్‌బాబుకు ఇద్దరు కుమార్తెలు. పెద్ద కుమార్తె శ్వేత, చిన్న కుమార్తె కీర్తి తండ్రికి అన్నీ తామై అంత్యక్రియలు నిర్వహించి కన్నీటి పర్యంతం అయ్యారు. హిందూ శ్మశానవాటికలో పెద్ద కుమార్తె శ్వేత తండ్రి భౌతికకాయానికి తలకొరివి పెట్టి రుణం తీర్చుకుంది. చూసిన వారంతా కన్నీరు పెట్టుకున్నారు.

అనాథ పిల్లలతో కాసేపు..


లీనా చారిటబుల్ ట్రస్ట్ పిల్లలతో..

దాబాగార్డెన్స్: నిత్యం చదువు, పనులతో బిజీబిజీగా గడిపే వారంతా శనివారం అనాథ పిల్లలతో కలిసి ఉల్లాసంగా గడిపారు. ఆట, పాటతో వారిలో ఉత్సాహం నింపారు. మీకు మేమున్నామంటూ భరోసా కల్పించారు. రోటాట్రాక్ క్లబ్ వైజాగ్ కపుల్స్ ట్రాక్, సన్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా రోటరీ క్లబ్ వైజాగ్ కపుల్స్ సహకారంతో నగరంలోని లీనా చారిటబుల్ ట్రస్ట్‌లో శనివారం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పిల్లలకు న్యూట్రిషన్ ఫుడ్, భోజనం ఏర్పాటు చేశారు. అంతే కాకుండా 5, 7 లీటర్ల ప్రెజర్‌కుక్కర్లు అందజేశారు. కాసేపు వారితో ఆడి పాడారు.